01082024-DIS-04_Layout 1 8/1/2024 2:52 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

## వయనాడ్‌లో వర్ష బీభత్సం

*వర్ష బీభత్సం సృష్టించిన జలవిలయంతో కేరళలోని వయనాడ్ ప్రాంతం అతలాకుతలమైంది. కొండచరియలు విరిగిపడి ఊళ్లకు ఊళ్లు బురదలో కూరుకుపోయాయి. 270 మంది మరణించారు. మృతుల సంఖ్య ఇంకా పెరుగుతుందని అంటున్నారు. బాధితుల ఆర్తనాదాలతో వయనాడ్ కొండలు ప్రతిధ్వనిస్తున్నాయి. కనీవినీ ఎరుగని రీతిలో సంభవించిన విపత్తు నుంచి ప్రజలను కాపాడేందుకు యుద్ధ ప్రాతిపదికపై సహాయక చర్యలు సాగుతున్నాయి. జూలై 29-30 తేదీల్లో వయనాడ్ ప్రాంతంలో అసాధారణమైన వర్షం కురిసింది. 48 గంటల్లో 572 మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్టు వాతావరణ శాఖ లెక్క తేల్చింది. ఇంతకూ ప్రకృతి ప్రకోపించడమే వయనాడ్ ఘోరకలికి కారణమా? లేక ఇందులో మానవ తప్పిదం ఏమైనా ఉందా?*

*కేరళ ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ పదేండ్ల క్రితమే, కేంద్రం వేసిన పర్యావరణ కమిటీ అంతకుముందే నివేదికలు ఇచ్చాయి. అందులో మొదటి కమిటీకి కస్తూరి రంగన్, రెండోదైన పశ్చిమ కనుమల అధ్యయన కమిటీకి మాధవ్ గాడ్గిల్ చైర్మన్లుగా సారథ్యం వహించారు. కొన్ని గ్రామాలను పర్యావరణపరంగా సున్నితమైనవిగా రెండు కమిటీలూ తమ తమ నివేదికల్లో పేర్కొన్నాయి. సున్నిత ప్రాంతాల్లో ప్రకృతి పరిరక్షణకు, ప్రజల సంరక్షణకు జనజీవన కార్యకలాపాలపై నియంత్రణలు విధించాలని రెండు కమిటీలు సిఫారసు చేశాయి. ప్రజల నుంచి ఈ సిఫారసులపై వ్యతిరేకత వచ్చింది. వాణిజ్య పంటలు, అభివృద్ధి ప్రాజెక్టులు, ప్రజల రోజువారీ అవసరాలకు విఘాతం కలుగుతుందనే నెపం మీద ఆ సిఫారసులను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది. కేరళ ప్రభుత్వం 2013లో కమిటీని నియమించగా 2014లో ఆ కమిటీ నివేదిక సమర్పించింది. దానిపై నోటిఫికేషన్ ఇంతవరకు విడుదల కాలేదు. ఈ లోగా గనుల తవ్వకం, టూరిజం పేరిట అటవీ ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టడం, తేయాకు తోటల పెంపకం వంటివి యథావిధిగా జరిగిపోయాయి.*


*పర్యావరణ పరిరక్షణకు అవసరమైన కఠిన చర్యలను ప్రభుత్వాలు చేపట్టకపోవడం వల్ల ఇప్పుడు వయనాడ్ మరుభూమిగా మిగిలింది. పశ్చిమ కనుమలలోని 57 వేల చదరపు కిలోమీటర్ల అటవీ ప్రాంతం పర్యావరణ పరంగా సున్నితమైనదిగా నోటిఫికేషన్ విడుదల చేయాలని కేంద్రానికి గాడ్గిల్ కమిటీ సూచించింది. కానీ కేరళ, తమిళనాడు, గోవా, మహారాష్ట్ర మధ్య ఏకాభిప్రాయం కుదరని కారణంగా ఆ సిఫారసు ఇప్పటికీ అమలు కాలేదు. ప్రస్తుతం పర్యావరణ మంత్రిత్వ శాఖ మాజీ డైరెక్టర్ జనరల్ సంజయ్ కుమార్ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం వేసిన కమిటీ ముసాయిదా నోటిఫికేషన్‌కు తుదిమెరుగులు దిద్దుతున్నది. మరింత సమయం కావాలని కూడా అడిగింది. కానీ ప్రకృతి బీభత్సాలు ఎవరి కోసమూ ఆగవు కదా! ప్రభుత్వాల తాత్సారం కారణంగా వయనాడ్ బురదమేటగా మారిపోయింది. ఇప్పటికైనా సున్నిత ప్రాంతాలను గుర్తించి, పర్యావరణానికి నష్టం కలిగించే మానవ కార్యకలాపాలను అదుపు చేయగలిగితే మంచిది. లేకపోతే బీభత్సాలను మనకు మనమే ఆహ్వానించినట్టుగానే భావించాలి!*

# రేవంత్‌లో అపరిచితుడు?

**రాజ్యాంగంపై ప్రమాణం చేసి ముఖ్యమంత్రి పదవిని స్వీకరించిన వ్యక్తి ఎంత బాధ్యతగా మెలగాలి? ఎంత పద్ధతిగా ఉండాలి? ఎంత సంయమనంతో వ్యవహరించాలి? కానీ మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇవేం పట్టడం లేదు. ప్రజాస్వామ్యయుతంగా నడిపించాల్సిన అసెంబ్లీని పరాచికం చేస్తున్నారు. చట్టాలు రూపొందే అసెంబ్లీలో ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు, అధికార అహంకారంతో రెచ్చిపోతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలో అభద్రత కొట్టొచ్చినట్టు కన్పిస్తున్నది. మొత్తంగా చెప్పాలంటే రేవంత్‌రెడ్డిలో అప్పుడప్పుడు అపరిచితుడు ప్రత్యక్షమవుతున్నాడు. అపరిచితుడిగా ఆయన వినిపిస్తున్న బూతు పురాణం, వ్యక్తిగత దూషణలను ప్రజలు అసహ్యించుకుంటున్నారు.**



**చిటుకుల మైసారెడ్డి**
94905 24724



ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్‌ఎస్ విషయ పరిజ్ఞానంతో కూడిన చర్చ మొదలుపెట్టడంతో రేవంత్‌రెడ్డి అంతర్మథనంలో పడిపోతున్నారు. ప్రతిదాడి చేసేందుకు ఆయనకు బూతు పురాణమే ఏకైక ఆయుధంగా కనపడుతున్నది. అందుకే ఆయన తిట్ల దండకాన్ని నమ్ముకుంటున్నారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను టీవీల్లో చూస్తున్న రాజకీయ విశ్లేషకులు ఆయనలో కనీస అవగాహన కరువైందని విమర్శిస్తుండటం శోచనీయం. నోటికి ఎంత వస్తే అంత మాట్లాడటం గౌరవం అనిపించుకోదని ముఖ్యమంత్రికి సూచిస్తున్నారు. ముఖ్యమంత్రి కాకముందు రేవంత్ రెడ్డి ఏం మాట్లాడినా చెల్లింది. కానీ ఇప్పుడు ఆయన రేవంత్‌రెడ్డి కాదు, ముఖ్యమంత్రి. ఈ విషయాన్ని ఆయన గుర్తుంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. అసెంబ్లీలోనే కాదు, బయట కూడా ఆయన మాట తీరు మారకపోవడం విడ్డూరం. ముఖ్యమంత్రి అయిన తర్వాత రేవంత్ మాటతీరులో మార్పు వస్తుందని చాలా మంది ఆశపడ్డారు. కానీ, ఆయన 'పేగులు మెడలో వేసుకుంటా', 'లాగుల తొండలు సొర్ర గొడుతా', 'పండవెట్టి తొక్కుతా', 'వంగోవెట్టి గుద్దుతా' లాంటి తిట్ల దండకంతో విడ్డూరంగా వ్యవహరిస్తున్నారు. రేవంత్‌రెడ్డి బూతుపురాణాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు అసెంబ్లీ వేదికగా ప్రజలకు మరోసారి గుర్తుచేశారు. ఇకనైనా ముఖ్యమంత్రి తన మాటతీరును మార్చుకోవాలని హితవు పలికారు.

అయితే, మొన్నటికి మొన్న విద్యుత్ కమిషన్‌పై చర్చలో భాగంగా ప్రభుత్వం, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్‌ఎస్‌ల మధ్య అసెంబ్లీలో మాటల యుద్ధం జరిగింది. ఈ సందర్భంగా ఒకవైపు సబ్జెక్ట్‌పై మాట్లాడాలని పదే పదే చెప్తూనే మరోవైపు ప్రతిపక్ష నాయకులపై రేవంత్‌రెడ్డి వ్యక్తిగత దూషణలకు దిగారు. ప్రతిపక్ష నేతలను తూలనాడారు. అధికారపక్షం వైపు నుంచి మంత్రులు గత ప్రభుత్వంపై ఆరోపణలు చేయగానే, గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ రంగానికి పెట్టిన ఖర్చు, విద్యుత్ ప్లాంట్‌లపై మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి సుదీర్ఘ వివరణ ఇచ్చారు. ఆయన ఒకడుగు ముందుకువేసి కేసీఆర్ ప్రభుత్వ హయంలో విద్యుత్ రంగంలో జరిగిన అభివృద్ధిని సభ దృష్టికి తీసుకువచ్చారు. మధ్యలో మంత్రి వెంకట్‌రెడ్డి, ఇతర మంత్రులు కలుగజేసుకొని అవినీతికి పాల్పడ్డారని వాగ్వాదానికి దిగారు. ఇందుకు జగదీశ్వర్‌రెడ్డి దీటైన సమాధానం ఇచ్చారు. 'మా హయాంలో తప్పు జరిగినట్టు రుజువు చేయండి నేను రాజీనామా చేస్తా'నని ప్రతిసవాల్ విసిరారు. దీంతో ప్రభుత్వం ఆత్మరక్షణలో పడిపోయింది. ఇది గమనించిన రేవంత్‌రెడ్డి కలుగజేసుకొని సభ వాతావరణాన్నే మార్చేశారు. అప్పటివరకు విద్యుత్‌రంగంపై చర్చ సాగుతున్న సమయంలో రేవంత్ ఎంట్రీ ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటి?

ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్‌ఎస్ నుంచి దీటైన జవాబు రావడంతో సీఎం రేవంత్‌లో ఆందోళన మొదలైంది. అందుకే హౌజ్ బయట ఉన్న సీఎం హడావుడిగా అసెంబ్లీకి వచ్చారు. ప్రధాన ప్రతిపక్షంపై వ్యక్తిగత దూషణలకు దిగారు. రేవంత్ దాడిని కేటీఆర్, హరీశ్, జగదీశ్వర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డిలు తిప్పికొట్టారు. ఇదంతా తట్టుకోలేక సీఎం అసెంబ్లీనే తప్పుదోవ పట్టించారు. అధికార పక్షమైనా, ప్రతిపక్షమైనా పనిచేసేది ప్రజల కోసమే. అందులో ప్రతిపక్ష పార్టీ బాధ్యత ఎక్కువగా ఉంటుంది. అధికార పక్షం ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. గత ప్రభుత్వంపై నిందలు వేస్తూ, తన తప్పులను, ఇచ్చిన హామీలను పక్కదారి పట్టించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం శతవిధాలా ప్రయత్నిస్తున్నదనేది నూటికి నూరుపాళ్లు నిజం. నిన్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి విషయంలోనూ సీఎం ఇదే అస్ర్తాన్ని ఉపయోగించారు.

ముఖ్యమంత్రి.. ముఖ్యమంత్రిగానే ఉండాలి. ఆయనలో అపరిచితుడు పూనుకుంటే ఎలా ఉంటుందో అసెంబ్లీ దృశ్యాలను చూస్తే సరిపోతుంది. బుధవారం నాటి అసెంబ్లీ సమావేశాల్లో కేటీఆర్ హుందాగా మాట్లాడుతుంటే సభను పక్కదారి పట్టించేందుకు సీఎం తీవ్రంగా ప్రయత్నించారు. ఇది గర్హనీయం. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని చెప్తే బతుకమ్మ చీరలపై చౌకబారుగా మాట్లాడారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని అవమానించారు. అక్క అంటూనే ఆమెను హేళన చేస్తూ మాట్లాడారు. ఒక మహిళను అసెంబ్లీ సాక్షిగా అవమానించిన ముఖ్యమంత్రిని ఇప్పటివరకు చూడలేదని మహిళలు భగ్గుమంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కితీసుకొని, మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి వెంటనే క్షమాపణలు చెప్పాలని రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అసెంబ్లీలో, అసెంబ్లీ బయట ముఖ్యమంత్రిగా రేవంత్ తన భాష తీరును మార్చుకోవాలి. తాను వ్యవహరించే తీరు ఎంత హుందాగా ఉంటే అంతగా రాష్ర్టానికి మేలు జరుగుతుందనే విషయం ఆయన తెలుసుకోవాలి.

(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్)

ముఖ్యమంత్రి.. ముఖ్యమంత్రిగానే ఉండాలి. ఆయనలో అపరిచితుడు పూనుకుంటే ఎలా ఉంటుందో అసెంబ్లీ దృశ్యాలను చూస్తే సరిపోతుంది. బుధవారం నాటి అసెంబ్లీ సమావేశాల్లో కేటీఆర్ హుందాగా మాట్లాడుతుంటే సభను పక్కదారి పట్టించేందుకు సీఎం తీవ్రంగా ప్రయత్నించారు. ఇది గర్హనీయం. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని చెప్తే బతుకమ్మ చీరలపై చౌకబారుగా మాట్లాడారు.



## నాయకుడా!

అడిగితివి
గదువ పడితివి
దండం పెడితివి
అది చేస్త
ఇది చేస్త అంటివి

జెండా రంగు చూసి,
నమ్మకం పెంచుకొని
అంగుటితో మీట నొక్కితి

గెలుపులో తేలిపోతివి
మూన్నాళ్ల కాకపాయె
కండువా రంగు మారిస్తివి

ముందు చెప్పాలె గదనే
నా ముఖం ముందుకు
వచ్చే పని
లేకపోవచ్చు, రాకపోవచ్చు

నీ ముఖం బొమ్మ
ఎక్కడ పెట్టాలో
నాకు తెలుసన్నా!



**సామాన్య**

**రాష్ట్రంలోని ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సంస్థల్లో గత రెండేండ్లుగా వందలాది మంది ఉద్యోగులు పదోన్నతుల కోసం పడిగాపులు కాస్తున్నారు. విద్యుత్తు యాజమాన్యాలు నిర్దిష్టమైన నిర్ణయాలు తీసుకోలేకపోతున్నాయి. రెండు అంశాలపై అవి ప్రభుత్వాన్ని వివరణ కోరుతున్నాయి. విద్యుత్తు సంస్థల్లో 2014, జూన్ 2 నుంచి ఇచ్చినటువంటి ప్రమోషన్లలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు సంబంధించి వారి ప్రాతినిధ్యాన్ని లెక్కించకుండా పర్యవసానంగా వచ్చే సీనియారిటీపై పదోన్నతులు కల్పించినట్టయితే ఆ పదోన్నతులను సమీక్షించి నష్టపోయిన బీసీ, ఓసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలనే అంశం ఒకటైతే, నేరుగా పోటీ పరీక్షల ద్వారా ఎంపికవుతున్న ఉద్యోగుల సీనియారిటీని మెరిట్ ప్రాతిపదికన నిర్ధారించి తదుపరి పదోన్నతి కల్పించాలనే అంశం రెండవది.**

# విద్యుత్తు ఉద్యోగుల పదోన్నతుల్లో వివక్ష



**కోడెపాక కుమారస్వామి**
94909 59625



ఉమ్మడి ఏపీ ప్రభుత్వం 2003 నుంచి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లను ప్రవేశపెట్టింది. 2009లో జీవో నెం 26ను జారీ చేస్తూ.. రిజర్వేషన్ వినియోగించుకొని పదోన్నతి పొందిన క్యాడర్‌లో కూడా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ప్రాతినిధ్యం లేనట్టయితే పర్యవసానంగా పొందే సీనియారిటీతో సహా పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలుచేయాలని తెలిపింది. ఏపీ, తెలంగాణ రాష్ర్టాల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పదోన్నతులకు సంబంధించిన జీవోలు 21, 5, 2, 26లను తప్పుగా అన్వయించి, ఉండాల్సిన ప్రాతినిధ్యం ఉన్నప్పటికీ పదోన్నతులు కల్పించారు. ఫలితంగా అనేక ఉన్నతస్థాయి పోస్టుల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఉండాల్సిన శాతానికి మించి లబ్ధి పొందారు. ఈ అన్యాయాన్ని గ్రహించిన కొందరు ఉద్యోగులు 2011లో జీవో 26ను సవాల్ చేస్తూ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌లో పిటిషన్ వేశారు. పిటిషన్‌ను విచారించిన కోర్టు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతుల్లో పర్యవసానంగా వచ్చే సీనియారిటీని ప్రాతినిధ్యానికి మించి ఇవ్వకూడదని జీవో 26ను రద్దు చేస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ, హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు డివిజన్ బెంచ్ 2018లో స్టేట్ ఆఫ్ తెలంగాణ వర్సెస్ ఎస్.ప్రకాష్ కేసులో అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ జారీచేసిన ఉత్తర్వులను రద్దు చేస్తూ, జీవో నెంబర్ 26ను సమర్థిస్తూనే సుప్రీంకోర్టు ఐదుగురు జడ్జిల రాజ్యాంగ ధర్మాసనం 2006లో నాగరాజు కేసు, 2018లో జర్నైల్ సింగ్ కేసు తీర్పుల్లో తెలిపిన విధివిధానాలను ప్రతి క్యాడర్‌లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ప్రాతినిధ్యాన్ని లెక్కగట్టి ప్రభుత్వ శాఖల్లో, ప్రభుత్వ రంగ సంస్థల్లో 2011 నుంచి కల్పించిన పదోన్నతులను అన్నింటిని సమీక్షించి నష్టపోయిన బీసీ, ఓసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలను ఆదేశించింది.


హైకోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం 2019లో అన్ని ప్రభుత్వ శాఖలకు, ప్రభుత్వరంగ సంస్థలకు ఆదేశాలు జారీ చేస్తూ 2014 జూన్ 2 తర్వాత కల్పించిన ప్రమోషన్లలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు సంబంధించి వారి ప్రాతినిధ్యాన్ని లెక్కించకుండా పర్యవసానంగా వచ్చే సీనియారిటీపై పదోన్నతులు కల్పించినట్టయితే ఆ పదోన్నతులను సమీక్షించి నష్టపోయిన బీసీ, ఓసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ఉత్తర్వులు జారీచేసింది. అందులో భాగంగా తెలంగాణ సాధారణ పరిపాలన శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, పోలీసు, తదితర శాఖల్లో పదోన్నతులను సమీక్షించారు. కానీ, విద్యుత్తు సంస్థల్లో ఏపీ, తెలంగాణ రాష్ర్టాల మధ్య ఉద్యోగుల విభజనకు సంబంధించిన కోర్టు ధిక్కరణ కేసు సుప్రీంకోర్టులో విచారణలో ఉన్న కారణాలన్నీ చూపి నేటికీ అమలు చేయలేదు. విద్యుత్తు సంస్థల యాజమాన్యాలు పదోన్నతుల సమీక్షపై నిరుడు అడ్వకేట్ జనరల్ అభిప్రాయం కూడా తీసుకున్నారు. ప్రస్తుతం విద్యుత్తు సంస్థల సీఎండీలపై హైకోర్టులో కోర్టు ధిక్కరణ కేసు విచారణలో ఉన్నది.

తెలంగాణ ప్రభుత్వ శాఖల్లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నియమించబడుతున్న ఉద్యోగుల సీనియారిటీని మెరిట్ ప్రాతిపదికన నిర్ధారించి ఆయా శాఖలకు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఎప్పటికప్పుడు అభ్యర్థుల సీనియారిటీని నిర్ధారించి పంపిస్తున్నారు. ఆ జాబితా ద్వారా పంపిన ఉద్యోగులకు పదోన్నతులను ఆయా ప్రభుత్వశాఖలు కల్పిస్తున్నాయి. కానీ, విద్యుత్తు సంస్థల్లో అమలుకు నోచుకోవడం లేదు.

2011లో అప్పటి యాజమాన్యాలు జోనల్, జిల్లా క్యాడర్లలో నియామకాలు పొందుతున్న అసిస్టెంట్ ఇంజినీర్లకు సంబంధించిన సీనియారిటీని మెరిట్ ప్రాతిపదికన నిర్ధారించాలని టీఓఓ. నం.13ను జారీ చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ట్రాన్స్‌కో యాజమాన్యం ప్రత్యేకమైన కమిటీని ఏర్పాటుచేసి కమిటీ నివేదిక ద్వారా 2021లో టీఓఓ నం.954ను జారీచేస్తూ నేరుగా నియామకాలు పొందుతున్న అన్ని క్యాడర్ల ఉద్యోగుల సీనియారిటీని మెరిట్ ప్రాతిపదికన నిర్ధారించాలని నిర్ణయం తీసుకున్నది. ఇతర విద్యుత్తు సంస్థలైన జెన్‌కో, ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ యాజమాన్యాలు కూడా ఉత్తర్వులను జారీచేసి పాక్షికంగా అమలుచేశాయి.

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవ తీసుకొని ప్రభుత్వ శాఖల్లో, ప్రభుత్వరంగసంస్థల్లో, విద్యుత్తు సంస్థల్లో పదోన్నతులను సమీక్షించి నష్టపోయిన బీసీ, ఓసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి న్యాయం చేయాలి. అదేవిధంగా విద్యుత్ సంస్థల్లో మెరిట్ సీనియారిటీపై ఉన్న వివాదాన్ని పరిష్కరించి విద్యుత్ సంస్థల సర్వీస్ రెగ్యులేషన్ పార్టు-2లోని 26(ఏ), తెలంగాణ స్టేట్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్ రూల్ 33(బి), 36(1)ల ప్రకారం నేరుగా పోటీ పరీక్ష ద్వారా ఉద్యోగాలు పొందిన అన్ని క్యాడర్‌ల ఉద్యోగుల సీనియారిటీని మెరిట్ ఆధారంగా నిర్ధారించి వెంటనే పదోన్నతులు కల్పించాలి.

(వ్యాసకర్త: రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం)




## చైనాకు లొంగిపోయిన మోదీ!



*ప్రధాని మోదీ చైనాకు లొంగిపోయారు. పాంగ్యాంగ్ సరస్సుపై కొత్తగా నిర్మించిన వంతెనను దాటుతున్న చైనా ఆర్మీ ముందు ఆయన మోకరిల్లారు. 'కోయి ఆయా నహీ' అని మోదీ విలపిస్తున్న సమయంలోనే లద్ధాఖ్‌ను చైనా వ్యూహాత్మకంగా ఆక్రమించేసింది. ఇది మనందరికీ విచారకరం.*

**- సుబ్రహ్మణ్యస్వామి, బీజేపీ సీనియర్ నేత**



# తెలంగాణకు నిధులేవి?



**జీడిపల్లి రాంరెడ్డి**
96666 80051

'2024 పార్లమెంటు ఎన్నికల్లో ఏ పార్టీకి మెజారిటీ రాదు, ప్రభుత్వ ఏర్పాటులో ప్రాంతీయ పార్టీలదే కీలక పాత్ర' అని నాలుగేండ్ల కిందటే కేసీఆర్ చెప్పారు. ప్రాంతీయ పార్టీలు ఏకమవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీజేపీలపై ఆధారపడకుండా, కేంద్రంలో ప్రాంతీయ పార్టీల నేతృత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి అభివృద్ధి, సంక్షేమం దిశగా సాగుదామని సూచించారు. కేసీఆర్ మాటలు నిజమవుతాయని నాడు ఎవరూ ఊహించలేదు. కానీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తర్వాత ఆయన మాటల్లోని అంతరార్థం అందరికీ అర్థమైంది.

'తల్లిని చంపి బిడ్డను బతికించార'ని చెప్పిన ప్రధాని మోదీ మొదటినుంచీ తెలంగాణకు వ్యతిరేకంగానే వ్యవహరిస్తున్నారు. నిధుల కేటాయింపుల్లో మొండిచెయ్యే చూపుతున్నారు. కేంద్రంలో మరోసారి గెలిస్తే తెలంగాణకు నిధుల వరద పారిస్తామని ఎన్నికల సమయంలో గప్పాలు కొట్టిన బీజేపీ నాయకులు ఇప్పుడు తమ నిజస్వరూపాన్ని బయటపెట్టారు. తాజా బడ్జెట్ కేటాయింపులే అందుకు నిదర్శనం. తెలంగాణకు ఏటా రిక్తహస్తం చూపుతున్న బీజేపీకి ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో 8 సీట్లను ప్రజలు కట్టబెట్టారు. అయినా ఆ పార్టీలో మార్పు రాలేదు. కేంద్రంలో మరోసారి మోదీ సర్కార్ వస్తే తమ బతుకులు మారుతాయని, తెలంగాణ బాగు పడుతుందని ఆశించి ఓట్లేసిన ప్రజలు మళ్లీ మోసపోయారు.

2014 నుంచి ఈ పదేండ్లలో బీజేపీ నేతలు అనేక హామీలిచ్చారు. ఐఐఎం ఏర్పాటు చేస్తామని, తెలంగాణలో ఓ ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తామని, మిషన్ కాకతీయకు నిధులిస్తామని, ఆదిలాబాద్‌లో సిమెంటు ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామని, రైల్వేకోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని.. ఇలా ఒక్కటా, రెండా ఎన్నో హామీలిచ్చారు. కానీ, వాటి అమలులో మాత్రం చిత్తశుద్ధి కనబరచలేదు.

అసలు మోదీ సర్కార్‌ది మొదటినుంచీ ఇదే తీరు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న తొలినాళ్లలో కేంద్ర ప్రభుత్వంతో ఆయన సఖ్యతతోనే వ్యవహరించారు. అయినప్పటికీ తెలంగాణకు కేంద్రం నయా పైసా ఇవ్వలేదు. అంతేకాదు, నిలువెల్లా విషం నింపుకొని తెలంగాణపై వివక్ష చూపడంతో కేంద్రంపై కేసీఆర్ పోరాటానికి దిగారు. మరో జాతీయ పార్టీ కాంగ్రెస్ కూడా అంతే. నాడు తెలంగాణ ఉద్యమంలోనూ, నేడు స్వరాష్ట్రంలోనూ ఆ పార్టీలు తెలంగాణకు వ్యతిరేకంగానే వ్యవహరిస్తున్నాయి.

బడ్జెట్‌లో తెలంగాణకు కేటాయింపుల కోసం బీజేపీకి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు, ఆరుగురు ఎంపీలు, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు చేసిన పోరాటం గాని, ఆరాటం గాని ఏమీ లేదు. అదే బీఆర్‌ఎస్ ఎంపీలు ఉండి ఉంటే.. పార్లమెంట్ లోపల, బయట గాయిగత్తర చేసేవారు. తెలంగాణకు జరిగిన అన్యాయంపై నిరసనగా పార్లమెంట్ ముందు బైటాయించేవారు. మోదీ సర్కార్ తీరును ఎప్పటికప్పుడు ఎండగట్టేవారు.

ఇక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. 'బడే భాయ్' అంటూ ప్రధాని మోదీతో చెట్టాపట్టాలేసుకొని తిరిగిన ఆయన రాష్ర్టానికి ఒక్క పైసా కూడా తీసుకురాలేదు. కేంద్రంతో సఖ్యతతో ఉంటే నిధులు వరద పారుతుందని, కేసీఆర్ వ్యవహార శైలి కారణంగానే తెలంగాణకు కేంద్ర బడ్జెట్‌లో అన్యాయం జరుగుతున్నదని మొన్నటి వరకు దుష్ప్రచారం చేసిన ఆయనకు మోదీ అసలు రూపం ఇప్పుడు తెలిసివచ్చింది. నీతి ఆయోగ్ సమావేశాలను కేసీఆర్ సర్కార్ బహిష్కరించినప్పుడు గాయిగాయి చేసిన రేవంత్ నేడు కేసీఆర్‌నే అనుసరిస్తున్నారు. ఆయన ఇప్పటికైనా అసలు వాస్తవాలను గ్రహించాలి.

తెలంగాణ రాష్ట్రంపై మోదీ సర్కార్ వివక్షను తెలంగాణ సమాజం ఇప్పటికైనా గ్రహించాలి. ఈ నేపథ్యంలో తెలంగాణపై వివక్ష చూపుతున్న మోదీ సర్కార్ మీద కేసీఆర్ పోరుకు దిగడం తప్పవుతుందా, లేదా? అనేది ప్రజలు ఆలోచించాలి. ఈ పరిస్థితుల్లో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండి, అత్యధిక పార్లమెంటు స్థానాలను బీఆర్‌ఎస్ గెలిచి ఉంటే పరిస్థితి వేరుగా ఉండేది. ఏదేమైనప్పటికీ మనోడు మనోడే. నాటికి, నేటికీ తెలంగాణకు కేసీఆరే శ్రీరామ రక్ష, బీఆర్‌ఎస్సే ఆత్మగౌరవ ప్రతీక. ఈ వాస్తవం తెలంగాణ ప్రజలు ఇప్పుడిప్పుడే గ్రహిస్తున్నారు. ఇది తెలంగాణ రాష్ర్టానికి శుభసూచకం. ■